# ముందడుగు

## సత్యభాస్కర్

ఎవరో తనవైపే తదేకంగా చూస్తుంటే ఇబ్బంది పడింది మహాలక్ష్మి. ఎక్కడో చూసినట్లే వుంది అనుకుంది. బస్సు అప్పుడే ఎర్రమంజిల్ దాటింది. తన ప్రక్కన కూర్చొని కిటికీ నుండి సిటీని చూస్తోన్న దుర్గ భుజం చుట్టూ చేయి వేసి దగ్గరకు అదుముకుంది.

కావాలనే పట్టించుకోనట్టుగా కిటికీ నుండి బయటకు చూడసాగింది.

''ఎక్స్‌క్యూజ్‌మి! మీరు కనకదుర్గ చెల్లెలు కదా!'' అంటూ ఆవిడ పలకరించింది.

తన అక్కయ్యను గుర్తుచేసేసరికి ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఎవరో తెలిసిన ముఖంలాగానే వుందే అని అనుకుంటున్నది నిజం అన్నమాట? అయినా సరే గుర్తుకు రావడం లేదు. సంభ్రమాశ్చర్యాలతో.

''అవునండి! మీరు... '' అంటూ సందేహంగా ఆగిపోయింది.

బస్సులో అంతగా రష్‌లేకపోవడంతో తన సీటుకు ఆనుకుని నిలబడిందావిడ. సాదాసీదా చీరలో వున్నప్పటికీ ముఖవర్చస్సు చూస్తే విద్యావంతురాలిగానే కనబడుతోంది. మెడలో ఏ ఆభరణాలు లేకుండా బోసిగా వుంది. ఆవిడ కళ్ళలో ఒక రకమైన తీక్షణత, మెరుపు చూడగానే మనిషిని నిలబెట్టేలాగుంది.

''అయ్యో నన్ను గుర్తు పట్టలేదా! నేను మీ అక్కయ్య క్లాస్‌మేట్‌ను. ప్రగతిని... ఒకసారి మీ ఇంటికి కూడా వచ్చాను'' అంటూ నవ్వుతూ బదులిచ్చింది.

ఒక్కసారిగా జ్ఞాపకాల కొండను కదిలించినట్లుగా అయింది. ఆవిడను తను ఎలా మరిచిపోగలదు. తనకు ప్రాణంలో ప్రాణమయిన అక్కను మరిచిపోనట్లే ప్రగతి అక్కయ్యను ఎలా మరుస్తుంది?......

***

ఇది ముప్ఫై సంవత్సరాల క్రితం సంఘటన.

గుడివాడలో డిగ్రీలో జాయిన్ అయిన అక్కయ్య హాస్టల్‌లో వుండి చదువుకుంది. మరీ పల్లెటూరు కావడంతో మా వూళ్ళో ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతికే చదువు ఆగిపోయింది. అక్కయ్య కొట్లాడి మరీ మా వూరికి ఐదు కిలోమీటర్ల దూరంలోని మరో పెద్ద పల్లెలోని జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్‌లో జేరింది. రోజూ బస్సులో వెళ్ళివచ్చేది. మా నాన్నగారికి అక్కయ్యను ఇంకా చదివించటం ఇష్టంలేదు. ఎక్కువ చదివిస్తే ఎక్కువ కట్నం ఇవ్వాల్సివస్తుందనేది ఆయన బాధ! ఏదో చాకలిపద్దుల చదువు వస్తే చాలు పొలం, పుట్రా వున్నవాడు దొరికితే అంటగడితే సరిపోతుంది అనుకునేవాడు. ఆయన మటుకు ఏమి చేస్తాడు?

నలుగురు ఆడపిల్లలు. ఆఖరున తమ్ముడు పుట్టాడు. మగసంతానం కోసం ఇంతమందినీ కన్నాడు. తానుచేసే గుమాస్తా ఉద్యోగానికి ఇందరినీ పోషిస్తూ పెళ్ళిళ్ళు చేసి బయటపడాలంటే మాటలు కాదు మరి! అందరిలోకి పెద్దదయిన దుర్గక్కయ్యకు ఇంటర్ కాగానే పెళ్ళి చేస్తానని కూర్చున్నాడు. చదువు ఆపేయమని గోడవ చేసాడు. అప్పటికి నేను ఎనిమిదోతరగతిలో వున్నాను. అక్కయ్య అప్పుడే పెళ్ళివద్దని ఏడ్చింది. ఇంటర్‌లో కూడా మార్కులు బాగానే వచ్చాయి. కనీసం డిగ్రి అయినా చేస్తానని గోల చేసింది. దాని ఏడ్పులకు మా పిల్లలమంతా కరిగిపోయి అక్కకు మద్దతుగా నిలబడ్డాం. అమ్మకూడా అక్కయ్యకే ఓటు వేసింది. ఎన్నడూ నాన్నకు ఎదురు చెప్పని అమ్మకూడా నాన్నగారితో పోట్లాడింది. చక్కగా చదువుకుంటున్న పిల్ల చదవనీయరాదండీ! ఇప్పుడే పెళ్ళి సంసారం అంటూ నాలాగే దాని జీవితం ఊబిలో కూరుకు పోతుంది అని అంటూ ఏడ్చింది. పెద్ద రగడ అయింది. ఇల్లంతా కంగాళి అయింది. అనుకోకుండా అదే సమయానికి మా పెద్ద మామయ్య గుడివాడనుండి ఊడిపడ్డాడు. ఆయన అదేదో ఇన్సూరెన్స్ కంపెనీలో పెద్ద ఉద్యోగం చేస్తున్నాడు. ఆయన మాటంటే మా నాన్నకు కొంత గురి వుంది. ఈ పంచాయతీనంతా ఆయన ముందు పెట్టారు.

ఆయన అందరి వాదనలు విని ఇలా తీర్పు చెప్పాడు.

''బావా! నీవు చెప్పింది నిజమే! పెద్ద దానికి ఎంత త్వరగా పెళ్ళిచేస్తే అంత మంచిది. నీ బాధ్యతలు త్వరత్వరగా తీరిపోతాయి. కాని రోజులు మారుతున్నాయి. ఆడపిల్లలు కూడా చదువులు బాగా చదువుతున్నారు. వాళ్ళుకూడా ఉద్యోగాలు చేస్తున్నారు. మా ఆఫీసులోనే చూడు. మా ఆఫీసరు, ఆడావిడవుంది. ఎం.ఎ. దాకా చదివింది. నలభైమంది స్టాఫ్‌ను గడగడలాడిస్తుంది. అందులోను దుర్గ చక్కటిపిల్ల. బాగా చదువుతుంది. పెళ్ళి గురించి నాకు వదిలేయి. దాని పెళ్ళి చేసే పూచి నాది. డిగ్రి కాగానే లేదా ఈ లోపలనే మంచి సంబంధం వెదుకు. పిల్ల డిగ్రి చేస్తోంది అంటే కూడా కట్నం తక్కువ తీసుకుంటున్నారు. గవర్నమెంటు కాలేజిలో వేద్దాం. ఆడపిల్లలకు హాస్టల్ వసతి కూడా వుంది. నేను కనిపెడుతూనే వుంటా...'' అంటూ హితబోధ చేసాడు.

అప్పటిదాకా చదివించేది లేదని భీష్మించుకున్న నాన్న పట్టుసడలించాడు.

'సరేలే! మీరందరు దాని పార్టీ అయితే నేను మాత్రం ఎందుకు అడ్డంవస్తాను. ఏమయినా రామం ఇప్పుడే చెబుతున్నా! నీదే పూచి! అదేమయినా వెర్రివేషాలేసినా చదువు వెంటనే మాన్పించేస్తాను' అంటూ ముగించి లేచాడు.

ఇల్లంతా పండగ వాతావరణం ఏర్పడింది. వారంరోజులుగా నలుగుతున్న సమస్య ఒక్కసారిగా తెగడంతో అందరి మొహాలు కళకళలాడాయి. అక్కయ్య మొహంలో వేయి మతాబుల వెలుగు కనబడింది. పిల్లలంతా కలిసి ''మా అక్క డిగ్రీ, డిగ్రీ'' అంటూ గంతులు వేశాము.

ఇంటికి పెద్దదవడంతో చిన్నప్పటినుండి దానినె

త్తినే చాకిరి అంతా పడేది. రేపు అత్తగారింటికి వెడితే ఏం చేస్తావో అని నసపెడుతూ దానితో ఇంటిపనంతా చేయించేవారు. ఇంటికి వచ్చేపోయే వారికి వంటలు చేస్తూ మర్యాదలు చేస్తూ అమ్మ కింద మీద పడేది. తెల్లవారుఝామునుండి రాత్రి పొద్దుపోయే దాకా అమ్మ అదే పనిలో వుండేది. దానితో చెల్లెళ్ళని, తమ్ముడిని దారిలో పెట్టే బాధ్యత అక్కయ్య మీద వుండేది. తాను చదువుకున్నాక మమ్మల్నందరినీ పెద్దరికంగా వుండి మంచి క్రమశిక్షణలో పెట్టేది. పచ్చిపల్లెటూళ్ళో పెరిగిన మాకు అక్కయ్య చెప్పేవిషయాలు మహా అబ్బురంగా వుండేవి. ఒక్క మాటలో చెప్పాలంటే అమ్మకన్నా అక్కయ్యనే మమ్మల్ని అమ్మలాగా పెంచిందనాలి. అందుకే పెద్దక్కయ్య అంటే మాకు ప్రాణం.

గుడివాడకు బస్సు ఎక్కించినప్పుడు ఆడపిల్లలందరం బస్‌స్టాప్‌కు వెళ్ళాం. ఎంతో సంతోషంగా వుంది. అక్కయ్య మమ్మలను విడిచి వెడుతోన్నా పిల్లలందరం కలిసి అక్కను డిగ్రికి పంపుతున్నామన్న గర్వంగా కూడా వుంది. ఆ బస్సు అక్కయ్యను వెంటబెట్టుకెళ్ళిపోయింది.

***

అక్కయ్యకు డిగ్రిలో క్లాస్‌మేట్ ప్రగతి. అక్కయ్య ఇంటికి వచ్చినప్పుడు చెప్పే కాలేజి కబుర్లలో ఆమెపేరు తరచుగా వచ్చేది. రాను రాను అక్కయ్య మరింత హుందాగాను, పెద్దరికంగానూ మారింది. ఎప్పటికప్పుడు ఎన్నో విషయాలు వివరిస్తూ మమ్మల్నందరినీ సమాజంలో తలెత్తుకు తిరిగేలా చేసింది. తాను నేర్చుకున్న ప్రతీది మాకు నేర్పాలని తహతహలాడేది. నేనయితే మరీను! అక్కయ్యకు నీడలా తిరిగేదాన్ని! అక్కయ్య వెళ్ళిన పదిరోజులకే అక్కయ్యను చూడాలని ఇంట్లో గొడవ చేసి మరీ గుడివాడ వెళ్ళివచ్చాను. నా బాధపడలేక నాన్న వెంట తీసుకెళ్ళాడు. హాస్టల్‌లో ఒకరోజు వుండనిచ్చారు. నాకయితే కొత్త ప్రపంచాన్ని చూసినట్లుగా వుంది. తనతోటివారందరికి నన్ను పరిచయం చేసింది. ఎన్నో జ్ఞాపకాలు మూటకట్టుకుని ఇంటికి వచ్చాను. నెలల తరబడి అమ్మకు వర్ణించి చెప్తుండేదాన్ని.

అంతా సజావుగా సాగిపోతున్న తరుణంలో అక్కయ్య జీవితం ఊహించని మలుపు తిరిగింది.

ఒకరోజు నాన్నగారు ఇంటికి వస్తూనే మామయ్యను వెంటపెట్టుకుని వచ్చారు. ఆయన ఆగ్రహంతో ఊగిపోతున్నాడు. రావడం రావడంతోనే అమ్మను కేకవేసాడు.

''ఎక్కడున్నావ్! ఇలారా వొకసారి'' అని అరిచాడు.

వంటగదిలో పొయ్యివెలిగిస్తున్న అమ్మ గాబరాగా బయటకు పరిగెత్తుకు వచ్చింది.

''నేను అపుడే చెప్పానా! దాన్ని డిగ్రీ చదివించవద్దే ఇంటర్మీడియట్‌తోనే పెళ్ళి చేసేద్దామని! అంతా కట్టకట్టుకుని నా ప్రాణం తిన్నారు. ఇప్పుడు మీ తమ్ముడు ఏం చెప్తున్నాడో విను. అది వాడి మాట కూడా వినకుండా తయారయిందట'' అని మండిపడ్డాడు.

పిల్లలందరం హాలులో చేరాం



''పోండి లోపలకు! పనీపాటలేదు. అన్నీ కావాలి మీకు'' అని అంటూ ఆయన ఒక్కసారి గద్దించడంతో అందరం లోపలి గదుల్లోకి పారిపోయాం. నేను ఒక్కదాన్నికిటికీ పక్కన కూర్చుని వినసాగాను. అక్కయ్యకు ఏదో ఆపద వచ్చిందని అనేసరికి నాకు కాళ్ళూ చేతులు ఆడడంలేదు. నోరు పిడచగట్టుకుపోయినట్లయింది.

''అంత సీరియస్ ఏమీ లేదు అక్కయ్యా... అదేం మరీ కాని పనేం చేయలేదు. కాని ఈ మధ్య ప్రిన్సిపాల్‌గారు నన్ను పిలిచారు. మీ అమ్మాయి ప్రవర్తన ఏమీ బావుండటంలేదంటూ కంప్లైంటు ఇచ్చాడు. ఏదో సభలు, సమావేశాలు ఊరేగింపులంటూ తిరుగుతోందట. చిన్నతనం గదా! ప్రతిదాని ప్రభావంలో పడతారు. మంచీచెడూ తెలియదు. వాళ్ళ క్లాస్‌మేట్ ఒకమ్మాయి వుందట. అదేదో పేరుకూడా విచిత్రంగా వుంది. ప్రగతి! అట.

అ అమ్మాయి మన జిల్లాకి ఆడవాళ్ళ సంఘానికి లీడ ర్‌ట. దానివెంబడి మన దుర్గ తిరుగుతోంది. మీ ఫ్యామిలి గురించి నాకు బాగా తెలుసు కాబట్టి చెబు తున్నాను. ఏదో చదువుకుని పెళ్ళి చేసుకుని సంసారం చూసుకోవాల్సిన కుటుంబం మీది. మీ జాగత్త మీరు పడండి'' అని సలహా ఇచ్చాడు అంటూ ముగించాడు. అమ్మ నెత్తిన పిడుగుపడ్డ ట్టయి మొఖం అంతా పాలిపోయింది. ఆవిడకు

విషయం అర్థంకాకపోయినా ఇంటా వంటాలేని పని చేస్తోందని తెలిసింది. తాము పెట్టుకున్న విశ్వాసాన్ని అక్క నిలబెట్టలేకపోయిందని కుప్పకూలిపోయింది.

''చిన్నపిల్ల తెలియక ఆమెతో తిరిగిందేమో? నువ్వు పిలిచి చెప్పకపోయావురా? నీ మాట బాగానే వింటుం దిగాదు!'' అని వణికే కంఠంతో అమ్మ అడిగింది.

ఆ రోజు నాకు ఇప్పటికీ కళ్ళ ముందు కదలాడు తుంది. కిటికీ నుంచి చూస్తున్న నేను భయంతో వణికి పోయాను. అక్కకేదో ఉపద్రవం వచ్చిపడిందని కళ్ళలో నీళ్ళు ఉబికి వచ్చాయి.

''అదీ అయింది! నేనెంత చెప్పినా వినట్లేదే! నేనేం తప్పుచేయడంలేదు అని అంటోంది. నిజమే! తప్పేమీ చేయడంలేదు కాని ఆడపిల్లలు రోడ్డెక్కితే



దానికి పెళ్ళి అవుతుందా! అది అర్థంచేసుకొని చావదు! ఎందుకయినా మంచిది మీ చెవిని కూడా వేద్దామని వచ్చాను. మీరయినా దాన్ని పిలిచి ఒక సారి గట్టిగా వార్నింగ్ ఇవ్వండి.'' అని కోపంగా అన్నాడు రామం మామయ్య. ఆ తర్వాత నాన్న అరుపులు, అమ్మ ఏడుపులు మధ్యలో మామయ్య సర్దిచెప్పడాలతో గందరగోళం అయింది. దాని చదువు మాన్పించి పెళ్ళి చేసేయాలని నిర్ణయమయిపోయింది. అక్కయ్యను ఉన్నపళాన ఇంటికి పంపమని నాన్న మామయ్యకు ఆర్డరేసాడు.

అనుకున్నంతా అయింది. మామయ్య చెప్పేడేమో! అక్కయ్య ఒక సాయంత్రానికి ఇంటికి వచ్చింది. కాని వస్తూ వస్తూ వెంట ఒక అమ్మాయిని తీసుకువచ్చింది. ఆమెను నేను వెంటనే గుర్తుపట్టాను. క్లాస్‌మేట్ అయిన ప్రగతి అక్కయ్య! నేను హాస్టల్‌లో ఒకరోజు వున్నప్పుడు ఆమె పరిచయమయింది.

అప్పటికి నాన్నగారింకా రాలేదు. అమ్మ అక్కయ్యని ముభావంగా పలకరించింది. వెంటవొచ్చిన ఆమె ఎవరు? అని అడిగింది. కోపాన్ని ఆపుకోవడానికి ప్రయత్నించినా ఆగడంలేదు. అక్కయ్య, ప్రగతి దొడ్లోకి వెళ్ళి కాళ్ళు, చేతులు కడుక్కొని హాల్లోకి వచ్చి కూర్చున్నారు. పిల్లలమంతా వాళ్ళ చుట్టూ చేరాం. అక్క తన స్నేహితురాలికి అందరినీ పరిచయం చేసి కబుర్లు చెబుతోంది. మా ఇంటికి మా చుట్టాలు తప్ప వేరే వ్యక్తి రావడం అదే ప్రథమం.

ఇంతలో హాల్లోకి వచ్చిన అమ్మ ''ఏమిటే అంతా సంతలా చేరారు! పనీ పాట లేదా పోయి చదువుకోండి'' అని ఒక్క అరుపు అరిచింది. దానితో మేమందరం లోపలి గదిలోకి వచ్చేసాం. అక్కయ్యకు మామయ్య వచ్చిన విషయం చెబుదామన్నా కుదరలేదు. ఏదో జరగబోతున్నదని మాత్రం నాకు భయంగా అనిపించసాగింది.

ఇంతలో నాన్నగారు రానే వచ్చారు. వసారాలో చెప్పులువదిలి లోపలకు వచ్చినాయన అక్కయ్యను ప్రగతిని చూసి విస్తుపోయారు.

''నువ్వెప్పుడొచ్చావ్?'' అని అట్నుంచి సమాధానం రాకుండానే ''ఈవిడ ఎవరు?'' అని అంటూ ప్రశ్నించాడు.

ఆయన సీరియస్‌నెస్‌కు అక్కయ్య బిక్కచచ్చిపోయింది. ఆయనకు కోపంవస్తే బెల్టుతో చావబాదుతాడనే భయం మా అందరికీ ఉండనే వుంది. కాని ఇంటర్‌కు వచ్చిన దగ్గరనుండి అక్కయ్యను కొట్టడం మానేసాడు.

''సాయంకాలమేవచ్చాను. ఈమె నా క్లాస్‌మేట్ ప్రగతి'' అని అంటూ పరిచయం చేసింది. గొంతులో తత్తరపాటు స్పష్టంగా వినిపించింది.

''ఎందుకొచ్చినట్లో?'' అని అడిగాడు. ప్రగతి 'నమస్కారమండి' అని అన్నా పట్టించుకోలేదు. అక్కయ్య నోట మాటరాలేదు.

'మన ఊరు చూస్తానంటే నేను పట్టుకొని వచ్చాను' అని సమాధానమిచ్చింది. ముఖమంతా అవమానభారంతో జేవురించింది.

'ఏం అమ్మాయ్! మీ అమ్మనాన్నలకు చెప్పేవచ్చావా?' అని ప్రగతిని ప్రశ్నించాడు.

ఇంతలో అమ్మ కాఫీగ్లాసులతో వచ్చింది. 'కాఫీ తీసుకోండి' అని అంటూ అందించబోయింది.

''నువ్వు నోర్మూసుకొని లోపలికి పో!'' అని అంటూ కాఫీగ్లాసును నేలకేసి కొట్టారు నాన్నగారు.

''అయ్యయ్యో! నాదేం తప్పు....'' అని అంటూ గ్లాసు తీసుకొని అమ్మ గుమ్మం దగ్గరకు వెళ్ళి నిలబడింది. బిడ్డను ఏమయినా చేస్తాడేమో అనే ఆందోళన ఆమె కళ్ళలో కనబడుతోంది. అవసరమయితే అడ్డంపడదామన్నట్లుగా వుంది.

'లేదండి! రేపు పొద్దునే వెళ్ళి పోతాను' అని అవమానభారంతో సమాధానమిచ్చింది ప్రగతి.

''మిమ్మల్ని చదువుకోమని పంపితే ఊళ్ళేలుతున్నారటగదా!'' అని అంటూ ఒక్కసారిగా విరుచుకుపడ్డాడు నాన్నగారు. ఆయన మాటలకు తిట్లకు అంతులేకుండా పోయింది. అక్కా ప్రగతి స్థాణువులయి నేలకు అతుక్కుపోయారు. ఆయన మాటకు తెరిపిచ్చినప్పుడు అక్కయ్య ఏడుస్తూనే ఇలా అంది.

'లేదు నాన్నగారు! మేమేమి తప్పుచేయలేదు! హాస్టల్‌లో మా సమస్యల గురించి వార్డెన్‌ను, ప్రిన్సిపాల్‌ను నిలదీసాం. అప్పటినుండి మా అమ్మాయిల మీద కక్షగట్టాడాయన మామయ్యకు మామీద లేనిపోనివన్నీ చెప్పి పంపించాడు' అని చెప్పింది.

'అవునండి! విద్యార్థుల సమస్యలకోసం మేము స్ట్రైకు చేసాం, ఊరేగింపు చేసాం తప్ప మీ అమ్మాయి దేమి తప్పులేదండి, ఆ ప్రిన్సిపాల్, వార్డెన్ పరమ అవినీతిపరులు' అంటూ ఏమో చెప్పబోయింది ప్రగతి.

'నోర్మూయవమ్మా! పెద్ద చెప్పొచ్చావ్! మా రామం నీ గురించి చెప్పాడులే! నువ్వేటగా ఊళ్ళో అందరికీ లీడర్‌వి! మాది పరువుగల కుటుంబం. నీలాగా రోడ్లమీద తిరిగితే మా అమ్మాయికి పెళ్ళి కాదు. నీ పేరు చూస్తేనే తెలుస్తోంది మీదెలాంటి కుటుంబమో. మా అమ్మాయిని వదిలేయ్! చేసింది చాలు. ఇక వెళ్ళు' అంటూ రౌద్రంగా అరిచారు నాన్నగారు. ప్రగతి నోట మాటరాలేదు. కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

'మాదీ పరువుగల కటుంబమేనండి. మీ కెంత కోపమొచ్చినా మీ అమ్మాయి చదువు ఆపకండి. అదేమీకు చెబుదామని వచ్చాను. ఇక వెళ్తాను' అంటూ లేచి గుమ్మంవైపు అడుగేసింది.

'ఆగు ప్రగతి!' అని అంటూ 'ఇంత రాత్రివేళ ఎక్కడకు వెళతావు' అని ఎక్కిళ్ళు పెడుతూనే ఆమె చెయ్యిపట్టుకొని ఆపింది. నాన్నగారు లోపలకు వెళ్ళడంతో మేమంతా బిల బిలమంటూ అక్క చుట్టూ చేరిపోయాం. ఏడుపు ముఖాలేసుకుని వాళ్ళిద్దర్ని చూస్తూ నిస్సహాయిగా నిలబడ్డాం.

అప్పటిదాకా బిక్కచచ్చిపోయి గడపకు అతుక్కుపోయిన అమ్మ ప్రాణం వచ్చిన బొమ్మలాగా పరుగునవచ్చి ప్రగతిని ఆపింది.

'ఆగు అమ్మాయి! ఆయన ఏదో కోపంలో అన్నాడని ఇంత రాత్రి ఆడపిల్ల బయటకు వెళ్ళడం మంచిది కాదు. నీకు గుడివాడ వెళ్ళేబస్సు రేపొద్దున వుంది. ఈ రాత్రికి వుండి పొద్దునే వెళ్ళమ్మా! మాకు ఇవన్నీ మామూలే. రెండ్రోజులుపోతే ఆయన కోపం చల్లారుతుంది. నీ తండ్రిలాంటివాడు. ఆయన మాటలకు ఏమి అనుకోకమ్మా! అన్నీ అవే సద్దుకుంటాయి. ముందు భోజనాలకు కూర్చోండి.' అని అంటూ అమ్మ బలవంతగా ఆపేసింది.

అక్క కూడా ''సారీ! ప్రగతి! నావల్ల నీవు మాటలు పడాల్సివచ్చింది.'' ''ఇవన్నీ మాకు చిన్నప్పటి నుండి అలవాటే'' అని ఏడుస్తూ 'రాత్రికి వుండి పొద్దునే వెళ్ళిపో!' అని అంటూ బ్రతిమలాడసాగింది.

వాళ్ళ మాటలకు సమాధానపడిన ప్రగతి, కళ్ళలో నీళ్ళు తుడుచుకుంటూ మళ్ళీ లోపలికి వచ్చి చాపమీద కూలబడింది. అందరు భోజనాలకు కూర్చున్నాం. నాన్నగారు రాలేదు.

అమ్మ నేను కలిసి అందరికీ వడ్డించాం. పిల్లలు పేచీలు పెడితే అమ్మ గదమాయించే సరికి నోర్మూసుకున్నారు. రాత్రి భయానకంగా గడిచింది. ఉదయం నేను లేచి చూసేసరికి ప్రగతి వెళ్ళిపోయింది.

***

మళ్ళీ ఇన్నాళ్ళకు...

''అయ్యో! మీరు గుర్తు లేకపోవడమేమిటి? బాగున్నారా!' అని అంటూ పలుకరించింది మహాలక్ష్మి. హఠాత్తుగా ఇన్నాళ్ళకు అక్కయ్య ప్రస్తావన రావడంతో ఒక్కసారిగా ఆమె కళ్ళలోనీళ్ళు తిరిగాయి.

ఈ లోపునే స్టాప్ రావడంతో పక్కనున్నామె దిగ



డానికి లేచింది.

'రా అక్కయ్యా కూర్చో' అని జరిగింది లక్ష్మి.

'మీ అమ్మాయా! ఏమి పేరు పెట్టావ్?' అంటూ దుర్గబుగ్గలు నిమిరింది.

'దుర్గాభవాని'అని జవాబిచ్చింది లక్ష్మి. 'పెద్దమ్మకు నమస్కారం చేయి' అని పిల్లకు చెప్పింది. దుర్గ సంభ్రమంగా చూస్తూ నమస్కారం చేసింది.

'ఎక్కడిదాకా పోతున్నావ్? ఎక్కడుంటున్నారు? మీ అక్క ఎక్కడుంది?' అంటూ ప్రశ్నలు వేయసాగింది.

'ఎల్లారెడ్డిగూడలో, మా చుట్టాలింట్లో ఫంక్షన్ వుంది. భోజనాలకు వెళ్తున్నాం' అంటూ జవాబిచ్చింది.

'నేను అమీర్‌పేటకు వెళ్తున్నాను. అక్కడ దిగాక మాట్లాడుకుందాం' అని అంది ప్రగతి. అంతలోనే బస్సు ఆగింది.

'మన స్టాప్ వచ్చేసింది. దిగుదాం పద.' అంటూ లేచింది ప్రగతి.

జనాలను నెట్టుకొని అందరూ దిగారు. దుర్గ అమ్మ చేయి పట్టుకొని కొత్త ఆంటీనే చూస్తోంది. అయిన వాళ్ళ పలకరింపులు పిల్లల్లో కూడా ఆత్మీయత రేకెత్తిస్తాయి. కొత్త ఉత్సాహాన్నిస్తాయి. అది మానవసహజం.

'ఇప్పుడు చెప్పు. మీ అక్క ఎలా గుందబ్బా!' అంటూ ఆత్రుతగా ప్రశ్నించింది ప్రగతి. అంతలోనే 'చూసి చాలా రోజులయింది' అని అంది.

ఒక్కసారిగా లక్ష్మి మొహం మ్లానమయింది. విషాదంతో గొంతు పూడుకుపోయింది.

'ఇంకెక్కడి అక్క.... పోయి చాలా కాలమయింది' అంటూ కళ్ళల్లో నీళ్ళు కుక్కుకుంది లక్ష్మి. ఒక్కసారిగా నడిచేది కాస్తా నిలబడిపోయి, లక్ష్మి చేయి పట్టుకొని ఆపేసింది ప్రగతి.

'అదేమిటి కనకదుర్గ పోయిందా! నాకెవ్వరూ చెప్పలేదు' అని వణికే కంఠంతో అంది ప్రగతి.

''హాయిగా పెళ్ళి చేసుకుని పిల్లాపాపలతో వుందనుకుంటున్నాను ఇన్ని రోజులు. ఎలా జరిగింది?'' అని ఆందోళనగా అడిగింది.

'అంతా మా ప్రారబ్దం! బంగారం లాంటి అక్కను కాల్చుకు తిన్నారు అత్త, ఆడపడుచులు. నిష్కారణంగా పొట్టన పెట్టుకున్నారు' అని అంటూ 'ఏముందక్కా! అంతా మామూలే! మనలాంటి ఆడవాళ్ళ బ్రతుకుల్లో కొత్త ఏముంది? చదువు మాన్పించి పెళ్ళి చేసాడు నాన్న! కొన్నాళ్ళ బాధపడ్డా మా అందరి మొహం చూసి సర్దుకుపోయింది. పెళ్ళయిన కొత్తల్లోనే అత్తగారింట్లో నానా కష్టాలు పెట్టసాగారు. కొన్నాళ్ళు పోయాక అవే సర్దుకుంటాయని అనుకున్నాం! కనీసం తిండి కూడా పెట్టకుండా ఇంటిల్లిపాది వెట్టిచాకిరీ చేయించారు. రోగమొచ్చినా మందు ఇప్పించలేదు. బంగారం లాంటి పిల్ల కాస్తా పాడయిపోయింది. కాని ఎప్పుడూ చెప్పుకోలేదు. కాని ఆ నోట ఈ నోట విని నాన్న ఎంతో బాధపడ్డాడు. ఇచ్చిన కట్నం సరిపోలేదంటే అప్పటికీ నాన్నగారు అప్పుచేసి మరీ వాళ్ళ కోర్కెలు తీర్చాడు. ఒకసారి పండగకు వచ్చినప్పుడు అమ్మకు చెప్పి ఏడిచింది అక్కయ్య. ఎంత హుందాగా వుండేది? ఎలా అయిపోయింది. బానిస చాకిరితో బక్కచిక్కిపోయింది. జబ్బుకూడా చేసింది. నాన్నగారు వైద్యం చేయించి అత్తగారింట్లో దిగబెట్టివచ్చారు. మా ఇంటినుండి వెళ్ళేటప్పుడు నాన్న అక్కతో అన్నమాటలు ఇప్పటికీ గుర్తున్నాయి. 'నీవు అత్తగారింటిని వదిలేసివస్తే నీ తర్వాతి వాళ్ళకు పెళ్ళిళ్ళు కావమ్మా! వాళ్ళకోసమైనా సర్దుకుపో'' అని సముదాయించాడు. కళ్ళనుండి జలజలా నీళ్ళు కారుతుండగా అక్క సమాధానమిచ్చింది. ''వాళ్ళ కోసమే నా చదువు మానిపించావు నాన్న! అదున్నా బయటకు వచ్చి ఏ వుద్యోగమో చేసి నా బ్రతుకు నేను బ్రతికే దాన్ని! నీకా భయం అక్కరలేదు. నేను అక్కడే పోతాలే!'' అని అంది. ఆ మాటకు అమ్మనాన్నా ఎంతో బాధపడ్డారు. ఆ రోజు వెళ్ళిన అక్క శవమయ్యాకనే మాకుకనపడింది' అంటూ కన్నీళ్ళపర్యంతమయి చెప్పింది లక్ష్మి.

మారు ప్రశ్నలేవీ అడగకుండా ప్రగతి అన్నీ విన్నది. కళ్ళలో నీరు తిరుగుతున్నా మొహంలో ఏ భావం కనబడలేదు.

'వెరీసారి లక్ష్మి! ఇదొక భయంకరమైన వార్త, నాకు. మీ ఇంటికి వచ్చినప్పుడు నేను ఇంకా చిన్న దాన్ని. మీ నాన్నగారికి ఏమి చెప్పలేకపోయాను. ఈ రకంగా అత్తింటి ఆరళ్ళకు, వరకట్నజ్వాలలో రోజు వేలాదిమంది మహిళలు మరణిస్తూనే వున్నారు. ఈ సమాజం ఇంకా ఎన్నాళ్ళకు మారుతుందో ఏమో!...'' అంటూ నిట్టూర్చింది.

'సరేలే అక్కా! నీవు ఏమి చేస్తున్నావు? పెళ్ళి అయిందా!'' అంటూ సందేహంగా అడిగింది.

అప్పటికే తేరుకున్న ప్రగతి 'నాకు అయింది లేమ్మా పెళ్ళి! అయితే నేను ఆ రోజు ఏమి చేస్తున్నానో ఈ రోజు అదే చేస్తున్నాను. నేను ఇప్పుడు రాష్ట్ర మహిళా సంఘానికి ప్రధాన కార్యదర్శిని' అని అంటూ చౌరస్తా రాగానే నిలబడింది.

''ఈ సందులోని కమ్యూనిటిహాల్లో మా సమావేశముంది. మళ్ళీ కలుద్దాం. నీకు వీలయితే రేపు ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సా. 6 గం.లకు మహిళల మీద యాసిడ్‌దాడులకు నిరసనగా సమావేశం వుంది. తప్పకరా!'' అంటూ తన విజిటింగ్ కార్డు ఇచ్చింది.

'అమ్మో మీటింగుకా!' అని అయోమయంగా అంది లక్ష్మి.

''ఏమిటి మీవారి పర్మిషన్ కావాలా? నన్నా రోజు మీ ఇంటికి వచ్చి మాట్లాడమంటావా?'' అని నవ్వింది ప్రగతి.

'మా యింటికా!' అని అంతలోనే సర్దుకొని 'తప్పకరా అక్కా! మా ఆయన చాలా మంచి మనిషి, మా నాన్నగారిలా కాదు.' అంటూ ఫోన్ నెంబరిచ్చింది.

ఇంతలోనే రయ్యిమంటూ ఒకతను స్కూటర్ మీద వచ్చి ప్రక్కన ఆగాడు.

'ప్రగతి! ఏమిటి లేటు, మీటింగ్ స్టార్ట్ అయింది' అని అన్నాడు ఆయన.

''సమయానికి వచ్చావ్! నా క్లోజ్‌ఫ్రెండ్ దుర్గ సిస్టర్. ఈయన నా జీవిత సహచరుడు. రాజేష్!' అని అంటూ పరిచయం చేసింది. 'బై' అంటూ ఇద్దరూ బండి మీద వెళ్ళిపోయారు.

***

సాయంత్రం 6 గంటలకు ప్రారంభించవలసిన మీటింగ్ మొదలయ్యేసరికి ఆలస్యం అయింది. 6.30 దాటిపోయింది. అప్పుడే ప్రెస్‌క్లబ్ హాల్ నెమ్మదిగా నిండుతోంది. వేదిక మీద అధ్యక్ష స్థానంలో వున్న ప్రగతి కళ్ళు ఎంట్రెన్స్‌ను గమనిస్తూ వున్నాయి. అక్కడకు వచ్చిన వారంతా దాదాపు అందరూ ఎప్పుడూ వచ్చేవారే. వారందరిని పలకరిస్తున్నట్లుగా చేయి ఊపుతోంది. సమావేశంలో వక్తల ప్రసంగాలు ప్రారంభమయ్యాయి. వాళ్ళ మాటలు వినడంలో మునిగిపోయిన ప్రగతి అసంకల్పితంగా ఎంట్రెన్స్ వైపు చూసింది. ఆమెకళ్ళు ఒక్కసారిగా మెరిసాయి. ఆనందభాష్పాలన్నట్టుగా కళ్ళు చమర్చాయి.

చీకట్లను చీల్చుకు వచ్చిన వెలుగులా మహాలక్ష్మి ఎంట్రన్స్ నుండి లోపలకు వస్తోంది. ఆమె చేయి పట్టుకొని దుర్గాభవాని వుంది. వెనకాలనే ఆమె భర్త కూడా వచ్చాడు.

*

రచయిత సెల్ నెం: 9848391638

కవిత
poem



## అతను

నా స్వర్గం నువ్వే
నా నరకం నువ్వే
నా సుఖం నువ్వే
నా దుఃఖం నువ్వే
నా ఆనందం నువ్వే
నా విషాదం నువ్వే
నా విజయం నువ్వే
నా వైఫల్యం నువ్వే
నా మిత్రుడివీ నువ్వే
నా శత్రువువీ నువ్వే
నా ప్రకృతీ నువ్వే
నా వికృతీ నువ్వే
నా సమస్యా నువ్వే
దానికి పరిష్కారం నువ్వే
నీతో కలిసీ జీవించలేను
నువ్వు లేకుండానూ మనలేను
సూర్యుడి చుట్టూ తిరిగే భూమిలా
భూమి చుట్టూ తిరగని సూర్యుడిలా
నీ చుట్టూ నేనే తిరిగి
నా చుట్టూ నేనే తిరిగి
ఈ భ్రమణ పరిభ్రమణాల వలయంలో
ఏ అక్షాంశం మీద నిన్ను కలవగలను?
ఏ రేఖాంశం మీద కలవకుండా ఉండగలను?

–జి.లక్ష్మి

సెల్: 94907 35322